## ఉన్నవాళ్ళ సరదాల చదరంగం క్రీడలో లేనివాళ్ళ బ్రతుకులు పావులేనా?

**కరువు! భయంకరమైన కరువు!!**

ఆ కరువులో చెరువులూ, నదులూ, బావులూ ఎండిపోయి బురద మాత్రం మిగిలింది.

మొలకెత్తిన గింజలు మొదలునుంచే ఎండిపోవడం మొదలైంది. రైతుల జీవితాలు మండకుండానే మాడిపోతున్నాయి.

మేయడానికి గడ్డి, తాగడానికి నీరులేక బలిసిన పశువులు బక్కపడ్డాయి. బక్కవి బతుకు చాలించాయి. బతికివున్న కొన్ని పశువులూ బాకీ కింద జప్తు చేసుకోబడ్తున్నాయి. అందుక్కూడా అర్హతలేనివి ఆకలితో చచ్చిపోతున్నాయి. వాటి చావుని కళ్ళతో చూడలేక సగంచచ్చిన బక్క రైతులు ఊరికి దూరంగా వదిలిపెడుతున్నారు. వాటిలాగే బతకలేమని అనుకున్న వాళ్ళు తాలూకాలకో, జిల్లాలకో, దూరప్రాంతాలకో పొట్ట చేతబట్టుకొని పోతున్నారు.

నేల తల్లిని నమ్ముకున్న కొందరు రైతులు నేలలో కలసిపోయినా ఫరవాలేదుగాని, దాన్ని విడిచి పోలేకున్నారు. ఆపత్కాలంలో యెవరైనా ఆదుకుంటారన్న ఆశ వాళ్ళని విడవడంలేదు.

ఆ ప్రాంతంలో అనంతపురం తాలూకా స్థాయికి చెందిన ఊరు. వాణిజ్యకేంద్రంగా అభివృద్ధి చెందుతున్నది.

రాత్రింబగళ్ళు చెమట ధారపోసి కష్టపడ్డా, చేసిన కూలీపనికి వచ్చిన డబ్బుతో కడుపు నిండకపోయినా, పట్టెడన్నం కళ్ళ చూడకపోయినా అనంతపురాన్ని దాటి అడుగు వేయలేకపోతున్నారు.

కారణం వడ్డీ వ్యాపారస్థులు సంక్రాంతి పండగ దగ్గరపడ్డకొద్దీ— మృగశిరలో పంతుకు మూడొంతులు చొప్పున ఇచ్చిన బాకీ కట్టమని వత్తిడి చేస్తున్నారు.

వత్తిడి చేస్తున్నవాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. చేయబడుతున్నవాళ్ళు కొన్ని వేల సంఖ్యలో వుండవచ్చు. వేళ్ళమీద లెక్కబెట్టేవారిలో ఇద్దర్ని మాత్రం ఆ వూళ్ళో ఏ మూలనుంచి చూసినా కనిపిస్తారు. వాళ్ళ మిద్దెలపై నుంచి చూస్తే ఊళ్ళోవాళ్ళు ఎవరెంత యివ్వాలో పేరు పేరునా పిల్చి వసూలు చేయొచ్చు.

వాళ్ళని దేవుళ్ళగా పూజించేవారున్నారు. రాక్షసులుగా భావించేవాళ్ళున్నారు. వీరు కాసుల నారాయణశ్రేష్ఠి. చనుబాల మార్కండేయశ్రేష్ఠి. శ్రేష్ఠిపదం సెట్టిగా మారింది. వీళ్ళతాత తరాలకు "మహాదాత" అని పేరు. ఇప్పటికీ 'దాత' లనే జనం అంటుంటారు. వీళ్ళకు బంధుత్వం ఉందో, లేదో తెలియదుగాని 'బావా' అని ఒకరినొకరు పిల్చుకొంటారు.

వారిఅంతస్థుల్లాగే మేడలుకూడా పక్కపక్కనే ఉన్నాయి. మేడలకు పక్కనే గోదాములుకూడా. అవన్నీ కలిపి ఓ ఊరంత ఉంటాయి. ఈ కరువులో వాళ్ళు తలుచుకుంటే ఊరు ఊరంతటినీ ఓ సంవత్సరం పాటు పోషించగలరు.

పీరుసాబుకు — పతంగుల్ని తయారు చేసే కాగితాన్ని, దర్గాపాషాకు మాంజాని తయారుచేసే దారాన్నీ అమ్మేది వీళ్ళే. వాళ్ళకు వీళ్ళిచ్చిన రేటుపైనే ఆ సంవత్సరం ధరలు నిర్ణయింపబడ్తాయి.

బంగారం మొదలు బంగాళాదుంపల వరకు వాళ్ళు సప్లై చేస్తారు. వాళ్ళు స్నేహితులే అయినా వాళ్ళమధ్య మంచుగడ్డ వేసినా మాడి మసిబొగ్గైపోతుందన్నట్లుగా వుంటుంది పోటీ.


వాళ్ళ ఇంటి ముందరున్న ఖాళీ స్థలంలోనే బీట్ జరుగుతుంది. ఆ బీట్‌లో అమ్మే ధాన్యం ధర నిర్ణయించేది కూడా వాళ్ళే. ఐతే ఈ సంవత్సరం వాళ్ళు ధర నిర్ణయించే అవసరం లేకపోతుందని బాధ పడుతున్నారు .... ఆ బాధని భరించలేకపోతున్న సమయంలోనే.

సంక్రాంతి పండగ రోజునాటికి పిల్లలకు పప్పన్నం కాకపోయినా పచ్చడి మెతుకులైనా పెడదామంటే లేకపోవడం వల్ల బాధపడుతున్నారు రైతులు.

చలి నెగళ్ళువేసి చలిని పారదోలే అవసరం లేదు ఈ యేడు భోగిమంటలు వాళ్ళ కడుపుల్లోనే బుగబుగ లాడుతున్నాయి.

పొద్దెక్కకముందే వాళ్ళకి యిద్దరి సేట్ల మిద్దెలు కనిపించాయి జవాబుగా!

మార్కండేయులు యింటిలోంచి రైతులు నారాయణ కొట్టులోకి అడుగు





# సేటు

నందిగం కృష్ణ
జయధీర్ తిరుమలరావు

వాళ్ళు వడ్డీ తక్కువ చేయమంటేనే వచ్చింది. అదీ రైతులపై కాదు. ప్రభుత్వంపై. అధిక ధరలపై. పెరిగిపోతున్న ధరలవల్ల తమకు ఎంతెంత నష్టం వాటిల్లుతున్నదో కన్నీళ్ళతో వివరించాడు. తత్ఫలితంగా—

డబ్బురూపేణా కాకుండా వస్తురూపేణా నూటికి ఇరవై చొప్పున వడ్డీఇస్తూ. ఇస్తా నన్న వాయిదా నాటికి ఒక రోజుముందే ఇవ్వనట్లయితే తాకట్టులోఉన్న వస్తువు తన స్వంతం అయ్యేట్టు కాయితం రాసిచ్చి సరుకు తీసుకునే షరతుమీదనే ఇవ్వడం జరుగుతుంది.

## 2

ఎండలో మిద్దెమీద గాలిపటాలు ఎగరేస్తున్న పిల్లల్ని తీసుకురమ్మని పంపిన గుమాస్తా ఎంతకీ రాకపోయేసరికి కోపం వచ్చి పైకి వెళ్ళాడు నారాయణ సేటు.

అతనక్కడికి వెళ్ళేసరికి అతని చిన్న కొడుకు పతంగి ఎగరేస్తున్నాడు. గుమాస్తా చరఖా పట్టుకున్నాడు. మిగతా పిల్లలు పేంచీలు చూస్తున్నారు. పక్క మిద్దెపై నుంచి మార్కండేయులు కొడుకు కూడా పేంచీ వేయడంలో నిమగ్నుడయ్యాడు.

పతంగివైపు తలెత్తి చూశాడు - కళ్ళు జిగేలుమన్నాయి. నులుముకుంటూ "పంతులూ ...." కోపంగా పిలిచాడు.

"చినసేటు పట్టుకొమ్మన్నాడు ...." నసుగుతూ,నాన్చుతూ దారంచుట్టిన చరఖా ఒక చిన్న పిల్లవాని చేతికిచ్చి తడబడుతూ మెట్లుదిగాడు.

మార్కండేయులు సేటు మిద్దెపై పిల్లలు ఆనందంతో అరుపులు, కేకలతో చప్పట్లు మ్రోగించారు.

నారాయణ చిన్నకొడుకు చిన్నబోయిన ముఖంతో "ఢీల్ రాకనే నా పతంగి తెగింది. గిపోరనికి పట్టస్తదా?" అన్నాడు.

పేదోడి ఆశలా తెగిన పతంగి గాల్లో తేలుతోంది. గమ్యం, భవిష్యత్తు లేని పేదోడి బతుకులా సాగిపోతోంది.

పేంచీ పడగానే దారం విడవకపోవడం వల్లనే పతంగి తెగింది. తన కళ్ళతో చూశాడు— తెగిన పతంగిదారం కిందపడ

కట్టారు కొత్త ఆశతో. తనను కాదని అక్కడకు వెళ్ళడం చూసిన నారాయణ సేటుకు నరనరం కోపంతో మసిలింది.

ఆ కోపాన్ని తమాయించుకోవాల్సిన అవసరం అతనికిలేదు. అట్లని వాళ్ళని ఒక్క మాట అనలేదు వచ్చినకోపం అంతా

గానే వీధిలోని పిల్లలు దాన్ని కూడా తెంపేసుకున్నారు.

దారంలేని మొండి చరఖాని చూసి

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్ & బాల్ పెన్సు
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారు చేయబడుచున్నవి.
అశోకా పెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

సినీ తారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు 5 రూ. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫొటోల సెట్టు 6 రూ. తెలుగు, హిందీ తారల అడ్రసులు (ఫోను నంబర్లతో సహా) గల పుస్తకం 2 రూ. ఎం.ఓ. చేయండి।
వై. కె. మూర్తి
దాసరివారివీధి. విజయవాడ-2

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు. గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించె శ్రేష్ఠమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివార్కి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరి బీజం(బుడ్డ) ఇస్నోఫిలియా, ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
బ్రాడీపేట, గుంటూరు. A.P.
3/1

నవ్వుతున్న పిల్లలపై కాకుండా మార్కండేయులు మీదిన కోపం వచ్చింద నారాయణ సేటుకు.

"అవ్వాలు చెయ్యంగనె పండుగయిందారా? సంక్రాంతి పండుగనాడు సూద్దాం తియ్. ఆయిల్ల నీ పతంగి కోసినోల్ల చేతుల్ల పతంగి ఎగురొద్దు.. ఆఁ। ఎండల ఆదొద్దు నడువుండ్రి" గదమాయించాడు.

పతంగి తెగడంతో నారాయణ కొడుకు ఏడుపుని చూసి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ మిద్దెమీదనె చాటుగా వున్న మార్కండేయులు వైపు అతని పిల్లలు చూశాయి.

"వడీల ఐము తక్కువచేసి సరుకుల పదికొట్టుడు కాదు బావా పతంగి పేంచీ.." పైకి వస్తూ అన్నాడు.

నారాయణ సేటుకి రోషం వచ్చింది. "దమ్ముంటే పండుగనాడు యెక్కించు సూద్దాం!"

"శానసార్లు చూసినలే."

"షర్తు కడ్తావా?"

"నాతో నేం షర్తు బావా - యింకో బిడ్డ పెండ్లి జెయ్యాలె నువ్వు" తన కొడుక్కి కాకుండా మరొక్కరికి బిడ్డనిచ్చిన కోపంతో అన్నాడు.

"నూరు నూరు కడ్తావా?" ఓంకంతో అన్నాడు.

"పండుగనాడు నా పోరగాండ్ల పతంగుల ఖుష్బు కాదు!" నారాయణ సేటుకు అహం దెబ్బ తిన్నది.

"ఐదు నూర్లు! ఐదు పచ్చకాయితాలు.. ఆఁ।" ఐదు వేళ్ళు చూపిస్తూ అన్నాడు.

మార్కండేయులు సేటు కూడా షాక్ తిన్నాడు. ఐనా తమాయించుకొని "బిడ్డకు కట్నం తక్కువిచ్చి కూడబెట్టిన నీ సొమ్ము ఎట్లముత్తను....కన్నాలకాడనోట్లు కడ్తాం. ఎవల్ది తెగితె వాళ్ళు ఓడిపోయినట్లు—"

అప్పటికే పిల్లలు చప్పట్లు కొడ్తూ పరుగులు దీశారు యింట్లో చెప్పడానికి. సేటును పిలవడానికి వచ్చిన కుర్ర నౌకరు ఆ మాటలన్నీ విని మళ్ళీ కిందికే వెళ్ళాడు గుమాస్తాకి చెప్పడానికి.

"గట్లనే" తలూపాడు

"గట్లనేగనీ — జాలీనోట్లు కట్టేవ్!" నవ్వుతూ వెళ్ళిపోయాడు మార్కండేయులు.

నారాయణ పెదాలపై నవ్వు నలిగిపోయింది.

## 3

ఊళ్ళోని పతంగులన్నీ ఆకాశంలో తేలుతున్నట్లు గాలి పటాలు! పెద్ద పతంగులు మేడలపైనుంచీ. మిద్దెలపైనుంచీ ఎగురుతున్నాయి. రోడ్ల పైనుండి. సందుల్లో గొందుల్లోనుంచి చిన్న పతంగులు ఎగురుతున్నాయి. అవెక్కువగా కరెంటు తీగలకో. టెలిఫోను తీగలకో లేదా ఎండిన చెట్లకో తట్టుకుంటున్నాయి.

మొత్తానికి ఆ సంక్రాంతి సాయంకాలం చూసేవాళ్ళకు సరదాగా, ఎగరేసేవాళ్ళకు సందడిగా, పతంగుల వ్యాపారస్తులకు లాభసాటిగా వుంది.

ఆ సరదా సందడి మార్కండేయులు. నారాయణ మేడలముందు అధికంగావుంది. అందరి కళ్ళూ ఆ మేడలపైనె. మేడలపై ఎగుర్తున్న పచ్చీస్‌దార్. టోపీదార్ పతంగులపైనే

సంక్రాంతి దీపం పతంగులు ఎగరేయాలన్న ధ్యాస ఎవరికీ లేదు.

నారాయణ. మార్కండేయుల మేడల మీదికి అతని పుత్రులూ. ఆంతరంగిక మిత్రులూ తదితర సమాన హోదా. గౌరవాలు గల వాళ్ళూ ఆయా మేడలమీద చేరి సూచనలు చేస్తున్నారు—సకినాలు తింటూ చాయ్‌లు తాగుతూ.

సాయంకాలం చలిగాలి రివ్వున వీస్తున్నది. ఆకాశంలో ఆ రెండు పతంగులు విలాసవంతంగా యెగురుతున్నాయి. అలా యెగిరినప్పుడల్లా—

"నారాయణశెట్టి మాంజా హైదరాబాదు పత్తర్ గట్టిల స్పెషల్‌గ ముగ్గుర్ని బెట్టి చేయించిండట...."

"మార్కండేయులు పేటు సన్నటి వైరు కట్టిండట! కోడిగుడ్లు, సీసం వర్కులు. కలమందయేసి ఎంత జబర్‌దస్తిగ చేపిస్తే ఏం లాభం!"

"నారాయణ్ సేటు పచ్చీస్‌దార్ వజను గున్నది. మార్కండేయులు సేటు టోపీదారుమీద పడ్తేనే ఖతం."

గాలికన్న వేగంగా వార్తలు వార్తలకన్న వేగంగా చూసేవాళ్ళ గుండెల్లో ఆలోచనలు!

ఈ రెండు పతంగులే కాకుండా మైదానంలో మరికొన్ని పోటీకి వస్తున్నాయి. ఐతే ఆవి హోల్‌సేల్ బ్లాక్ మార్కెటీయర్ ముందు ఒకటీ అరా బస్తాలమ్మే చిన్న సేట్లలా వున్నాయి.

అడ్డొచ్చిన ఓ చిన్న పతంగిని పచ్చీస్‌దార్ కోసేసింది. మిగిలిన చిన్న పతంగులు అక్కణ్ణుంచి తప్పుకున్నాయి.

## 4

పతంగులు ఎగుర్తున్న పడమటి దిక్కువున్న కంచరికుంట వీధుల్లో తుమ్మపొరక కట్టిన బొంగులను ఎవరి స్థాయిలో

వాళ్ళు తయారు చేసుకుంటున్నారు. పతంగులు లూటడంలో వూళ్ళో పేరు మోపిన జాన్‌మియా, అతని మిత్రులూ ఎగిరే పతంగుల్ని చూస్తూ ఎత్తునూ, గాలి వేగాన్నీ, పేంచీ అయ్యాక పోయేదారాన్ని బట్టి తెగిన పతంగి ఎంతదూరంలో పడుతుందో అంచనా వేస్తున్నారు.

తుడుం చేరాలూ, అతని తమ్ముళ్ళు ముగ్గురు కలసి తెగిన పతంగిని పట్టుకోడానికి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. దొరికిన ఐదువందలు నలుగురికి సమానం!

ధాన్యం బస్తాలు మోసి బతికే మైమూదూ, అతని పన్నెండేండ్ల కొడుకు యాకూబు పతంగి వెంట త్వరగా వెళ్ళడానికి సైకిల్ అద్దెకు తెచ్చుకొని రెడీగా వున్నారు. యాకూబు చేతిలో పొడుగాటి కట్టె వుంది.

ఎక్కువ దారంతో తెగితే, ఆ దారాన్ని పట్టుకోడం కోసం కొంతమంది ఆజాలం డోర్ సిద్ధం చేసుకొన్నారు.

కంచరికుంట నుంచి చూస్తే ఆ రెండు పతంగులు చిన్నగా కనిపిస్తున్నాయి. దగ్గరగా వస్తూ విడిపోతున్నాయి.

## 5

కంచరికుంటకు ముందువైపున్న మైసమ్మ చింతకు చిక్కుకున్న ఎర్ర పతంగిలా వున్నాడు సూర్యుడు.

ఆ చింత కింద చుట్టుపక్కల కరువుకి తట్టుకోలేక కూలినాలి చేసుకోడానికి వచ్చి తడక గుడిసె లేసుకొన్నారు. పచ్చీస్‌దార్ పతంగి ఫిట్స్ విమానంలా పల్టీలు కొడుతోంది గాల్లో. మార్కండేయులుకి దాని వాలకం చూస్తే ఆనందంగా వున్నా మనసులో భయంగా వుంది.

వ్యాపారంలో అడ్డొచ్చిన అధికారుల్నీ, పోటీపడ్డ తోటి వ్యాపారుల్నీ వమ్ముచేసి ఏకచ్ఛత్రాధిపత్యంగా వాణిజ్య రాజ్యం యేలుతున్న గర్వంతో పచ్చీస్‌దార్ టోపీదార్ వైపు దూసుకుపోయింది.

## 6

పచ్చీస్‌దార్ తెగింది!

ఊరిబయట—

తలకు కిలో ధాన్యం ఊరికే పంచుతున్నారన్నట్లు తోసుకుంటూ పరుగు తీస్తున్నారు జనం. కేకలూ, అరుపులూ, అడుగుల శబ్దాలతో వాతావరణం నిండిపోయింది.

మైసమ్మ చింతకింది గుడిసెల్లోని బుడ్డగోసి పిల్లలుకూడా పరుగు లంకించుకున్నారు. మూరెడు తుమ్మకంపను బారెడు కర్రెకు కట్టి,

KANTA CHAP

నవ్యతకి నాణ్యతకి యువతరానికి సరిపడు, బొంబే డయింగ్ వారి పాలిస్టరు టెక్స్ రైజు సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్, డ్రెస్ మెటీరియల్స్ సరి క్రొత్త స్టాకులో ఎన్నుకొనండి.

బొంబే డయింగ్ షోరూం

శ్రీ లక్ష్మి

స్టేషన్ రోడ్, కొత్తగూడెం.



నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి! చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి!

హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు. ప్రతి ఆదివారం భీమవరం షణ్ముఖి లాడ్జి నందు ఉదయం గం. 9 నుండి సాయంత్రం 6-30 వరకు క్యాంపు కలదు.

డా|| డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కు రోడ్డు, గుడివాడ-521 301.

ఫోన్స్ : 522 & 540

SHAH ADS

భారతీయ జ్ఞానపీఠ్ అవార్డు 1,00,000 రూపాయలు బహుమతి పొందిన నవల

చిత్రసుందరి

సుప్రసిద్ధ తమిళ రచయిత అఖిలన్ రచనకు అనువాదం మధురాంతకం రాజారాం

3.11.1981న, విడుదల! వెల.30/రూ.

ప్రభాషలో ప్రకటించబడి లక్షలాది ప్రతులు విక్రయమైన ఈ పెద్దనవల అందరికీ అందుబాటులో ఉండే నిమిత్తం- అక్టోబర్‌లోనే తమకాపీ రిజర్వు చేసుకొని 21 రూపాయలు M.O. పంపిన వారికి విడుదలకాగానే పోస్టు ఖర్చులకు మాత్రం వి.పి.లో పంపిస్తాం..

అఖిలన్ లేఖిని నుంచే మరో ఆణిముత్యం

మనస్విని

అనువాదం

మధురాంతకం రాజారాం

స్నేహ సౌరభాలను వెదజల్లే నవలా పారిజాతం, ప్రపంచ ప్రసిద్ధి పొందిన ప్రణయగాథలతో మరొక మణిపూస.

3.11.1981న. విడుదల!

వెల. 7.50 పైసలు.

అక్టోబర్ లోనే తమ కాపీ రిజర్వు చేసుకొని రూ.6/- M.O. పంపిన వారికి పోస్టు ఖర్చుకు వి.పి.లో పంపిస్తాం

మాలతీ చందూర్

అల్లికలు కుట్లు

ఎన్నో కొత్త విషయాలను విశేషాలను, డిజైన్లను బొమ్మలను చేర్చి, కూర్చి విస్తృత పరచిన అపురూపమైన ఈ పుస్తకం త్రివర్ణముఖ చిత్రంతో

3-11-1981న. విడుదల!

వెల: 30/రూ||

అక్టోబర్‌లోనే తమ కాపీ రిజర్వు చేసుకొని 21/రూ. M.O. పంపినవారికి పోస్టు ఖర్చులకు మాత్రం వీ.పీ.లో పంపిస్తాం...

వినువీధిలో వింతలు.

3-11-1981. విడుదల! వెల.27/రూ.

రావూరి భరద్వాజ రచన...

అక్టోబర్‌లోనే తమకాపీ రిజర్వు చేసుకొని 21/రూ|| M.O. పంపినవారికి పుస్తకం విడుదల కాగానే పోస్టు ఖర్చులకు మాత్రం వి.పి.లో పంపిస్తాం.

శ్రీ కమలా పబ్లిషింగ్ హౌస్

గవర్నరుపేట.. విజయవాడ.2

GEETHA

మైలు దూరంనుంచి కంచరికుంటకు నీళ్ళు మోసుకొని వస్తున్న స్త్రీలు యెక్కడ నీళ్ళకుండలను తాకుతారోనని భయంగా రోడ్డు దిగారు.

తుడుంచేరాలు భూమ్మీద కాలు పడకుండా పరుగెత్తుతుంటే అతని తమ్ముడు సాయిలు పొడుగాటి బొంగుతో పరుగెత్తుతున్నాడు. పతంగికి ఎంత దారం ఉందోనని పైకి చూస్తూనే పరుగు తీస్తున్నాడు. చేతిలోని బొంగు నాల్గు చక్రాల పల్లికాయల బండికి తాకి పక్కకు దొర్లింది. దాన్ని పట్టుకోబోయి బండి అతను రోడ్డు పల్లంలో పడాడు. కింద పడ్డ బొంగుని అందుకొని మళ్ళీ ఒకటే పరుగు!

గాల్లో ఎత్తుగా పోతున్న పచ్చీస్‌దార్ కొంత కిందికి దిగింది.

"జడ్‌పి ఇస్కూల్ కాడ్కి.. ఇస్కూల్ కాడ్కి" పరుగెత్తుతూనే జానీ హుకుం జారీచేశాడు తన గ్రూపుకి—తన అంచనా దాటిపోతూన్న పతంగిని చూస్తూ. అతని చారల చారల రబ్బరు బనియను చూసి కొందరు ముందే దారి విడుస్తున్నారు. పతంగి తనకు దొరికినా జానీ కత్తిచూపి లాక్కుంటాడేమోనని భయపడి పరుగు వేగం తగ్గింది చేరాలుకు.

రోడ్డుమీద - సైకిల్ అడ్డుతగిలి నడుస్తున్న రిక్షా చక్రం కింపడింది. రిక్షా ఆగడం చూసి కూడా పరుగువేగం తగ్గించే సమయంలేక రిక్షాకే తగిలారు జనం. రిక్షావాడు అరుస్తూ లబలబమంటున్నాడు. సందులోంచి వచ్చిన జనం రోడ్డుమీద విరుచుకుపడ్డారు. రిక్షాని తప్పుకొని పక్కనుంచి పరుగెత్తుతుంటే వేగంగా వస్తున్న బస్సు ఎంత సడన్‌బ్రేకువేసి ఆపినా ఆగాల్సినచోట ఆగలేక రిక్షా వెనక భాగానికి బలంగా తగిలింది. హాహాకారాలు చెలరేగాయి. బస్సుచుట్టూ జనం పోగయ్యారు.

పరుగువేగాన్ని తగ్గించలేక చేరాలువచ్చి బస్సుకు తగిలాడు. అది చూసికూడా సాయిలు అదేమీ పట్టించుకోకుండా బొంగుతోసహా ఆగిన బస్సు పక్కనుంచి తప్పుకున్నాడు.

బస్సుని తప్పుకుని మైమూదు సైకిల్ స్పీడు పెంచబోతుంటే పతంగిని చూస్తూ పరుగెత్తుతూ అడ్డువచ్చిన పిల్లవానికి టక్కరుపెట్టి కిందపడ్డారు. యాకూబుకి దెబ్బలు తగిలాయి. సగం తిన్న కందగడ్డ యాకూబు జేబులోంచి కిందపడింది. వెంటనే దిసమొలతో వున్న ఆరేళ్ళ అమ్మాయి అది అందుకుని పరుగు తీసింది. యాకూబుని అక్కడే వదిలేసి వంకరపోయిన హేండిల్‌ని సరిచేసుకుంటూనే సైకిలెక్కాడు మైమూదు.

రేషను కోసం, గ్యాసునూనె కోసం క్యూలో తగిలే దెబ్బలకన్నా ఎక్కువగా తగలనట్లుంది. తెగిన పతంగిని చూస్తుకుంటుతూనే ముందుకు నడిచాడు యాకూబు. దెబ్బ తగిలినందుకు కాకుండా పొద్దుటినుంచి తినడానికి దొరికిన ఒకే ఒక్క కందగడ్డ పోయినందుకు బాధగా వుంది.

పతంగి కన్నాల్లో తెగడంవల్ల దారం లేదు. దారం లేనందున ఎక్కువ సేపు గాల్లో వుండగలిగింది. మరికొంత దూరం ప్రయాణించింది.

జానీ సన్నని సందుల్లోంచి జింక కాళ్ళతో వేగంగా వచ్చాడు. పతంగిని అనుసరించి వేగాన్ని తగ్గించాడు. ఐదు నోట్లు అతని కళ్ళముందు కదులుతున్నాయి. అతని గ్రూపువాళ్ళు పొడవాటి తేలికైన కర్రనందిచ్చారు. పతంగి వాటు చూసి చెకచెకమని స్కూలు కొత్త బిల్డింగ్ పైకి ఎక్కాడు. పతంగి తాటిచెట్టంత ఎతులో ఉంది.

పంచరైన సైకిలును పక్కనే పడేసి కర్రకోసం వెతుకుతున్నాడు మైమూదు. పాత బిల్డింగులోని పదోక్లాసుగది కప్పుపైన ఎక్కి రాయికి దారంకట్టి ఆజాలం డోర్ విసిరాడు చేరాలు. దారం గూన పెంకుకు తట్టుకొని పైకి ఎగరలేదు. మళ్ళీ ప్రయత్నించాడు.

సన్నగా గాలి వీచింది. పతంగి మరింత ముందుకు కదిలి కబడ్డీ మైదానంవైపు దారి తీసింది. జనం అటువైపు పరుగెత్తారు.

అక్కడ—

ఆ రోజు కడుపు నింపుకోడానికి దొమ్మరివాళ్ళు చిన్న చిన్న జీవాల్ని వలలతో వేటాడుతున్నారు.

అమాంతం జానీ బిల్డింగ్ పైనుంచి దూకాడు. చేరాలు గూన కప్పుపై గూన పెంకులు పగుల్తున్నా గబగబా నడిచి నీళ్ళ టాంకు పైకి, అక్కడనుంచి భూమ్మీదకు దూకాడు. సగం పగిలిన సీసం పెంకు గుచ్చుకుంది కాలుకు. "నీయక్క!" తిట్టుకుంటూ పరుగెత్తాడు కుంటుతూ.

కుంటుకుంటూ స్కూల్ వెనకవైపున్న పగిలిన గోడ నెమ్మదిగా దూకి దిడ్డిదారిన కబడ్డీ గ్రౌండ్‌లోకి ప్రవేశించాడు యాకూబు.

కొబ్బరిచెట్టంత ఎత్తులో తాటికమ్మంత పచ్చీస్‌దార్ ఎగురుతూంది. అతనికి పట్టరాని ఆనందం వేసింది. కళ్ళు మెరిశాయి. నొప్పి మరిచాడు. శరీరాన్ని పైకిలేపి కాలివేళ్ళ కొనలమీద నిలబడి పొరక బొంగుని చేతివేళ్ళ కొసలతో పట్టుకొని పతంగిని పట్టుకోడానికి పైకి ఎత్తాడు. ఎగురుతూ ప్రయత్నించాడు. ఇంకా మూరెడుపొడుగు తక్కువగా వుంది.


జనం కొత్త బిల్డింగ్ వైపునుంచి కబడ్డీ గ్రౌండులోకి ప్రవేశించారు. బొంగుకర్రని ఎక్కుపెడుతూనే వచ్చాడు జానీ.

యాకూబుకి పదడుగుల దూరంలో ఓ కారువచ్చి ఆగింది. తలుపు తెరుచుకొని ఓ వ్యక్తి కారుపైకి ఎక్కి వెంట తెచ్చుకొన్న కర్రతో యాకూబు బొంగుని కొట్టాడు. బేలెన్సు ఆగలేక ఎగిరి అంత దూరంలో పడిపోయింది. పతంగిని అందుకొని వెనక సీట్లోకి దూరాడతను.

చేరాలు పాదం రక్తం కారుతున్నా గబగబా వచ్చాడు, కారులోకి దూకుతున్న వాడి చేతిలోని పతంగిని అందుకోవాలని.

కారు అక్కడ కనిపించడంతో కేకలు మాని విస్తుపోయి నోళ్ళుతెరిచారు పిల్లలు.

రేషనుక్యూలో ఉదయంనుంచి సాయంకాలంవరకు నిలుచుని తనవరకు రాగానే



తన కళ్ళముందే ధాన్యం బస్తాల్ని తరలించి తనకు మొండిచేతులు చూపినట్లనిపించింది యాకూబుకి. అతని కళ్ళలో రక్తం తిరిగింది. అసలే కరువు. కరువులో అయిదు వందలు! పడిపోయిన కర్రని అందుకొని కారుపైకి విసిరాడు జోరుగా.

స్టార్టింగులో వున్నకారు రయ్యమని దూసుకుపోయింది.

కారులో—

స్టీరింగు నడుపుతున్న మార్కండేయులు సేటు పెద్దకొడుకు, పక్కనే కూర్చున్న నారాయణ సేటు అల్లుడు పెద్ద పెట్టున నవ్వుకుంటూ పతంగిని చింపేసి ఐదునోట్లని వరసగా లెక్కించుకొన్నారు. ఏక్....దో....తీన్.

